

శ్రీ కొండేపూడి సూర్యప్రకాశరాజు

గడచిన అయిదారు సంవత్సరాలనించీ ఆ వృద్ధ దంపతులు ఆ వూళ్లో నివసిస్తున్నారు. ఆయన పేరు సుబ్బయ్య ఆవిడ పేరు సీతమ్మ. పూర్వం వాళ్లెక్కడుండే వారో, వారి పుట్టుపూర్వోత్తరా లేమిటో ఆ వూరి వారెవరికీ తెలీదు. బహుశా ఆయన ఏదో వుద్యోగంనించి రిటైరయి జీవితశేషాన్ని ప్రశాంతంగా గడపటానికి గాను అటు పల్లె కాకుండా, యిటు పట్నం కాకుండా మధ్యరకంగా వున్న ఆ గ్రామానికి వచ్చివుండొచ్చు.

దేహపరిశ్రమకు గాను సుబ్బయ్య ప్రతి రోజూ ఉదయం సాయంత్రం కూడా కనీసం రెండు మైళ్లయినా నడిచి వస్తుంటాడు. అతనికి డబ్భైఅయిదు సంవత్సరముల వయసు వున్నప్పటికీ శరీరం మాత్రం కృంగిపోలేదు; అడుగు కూడా తొందరగానే పడుతుంది. అతని శరీరచ్ఛాయ జాగ్రత్తగా భద్రపరచిన నిల్వబత్తాయి పండుయొక్క అస్వాభావికమైన రంగుతో పోల్చొచ్చు.

సీతమ్మ ఎప్పుడూ యిల్లు వదలి బయటకు వెళ్ళేది కాదు. కూరగాయలు, పాలు మొదలైనవి అమ్మటానికి యింటికి వచ్చిన వాళ్లతో తప్ప మరెవ్వరితోనూ మాటాడి ఎరగదు. ఆమె తన భర్త కంటె చాలా చిన్నదయినా పెద్దదానిలాగ కనపడుతుంది. ముడతలు పడిన ముఖం, నెరసిన జుట్టు, సులోచనము ధరించిన కళ్లూ మొట్టమొదట ఆకర్షిస్తవి. జాగ్రత్తగా ఆమె ముఖాన్ని పరిశీలిస్తే సుఖమనేది ఎన్నడూ ఎరగనట్టు కనపడుతుంది. పనిమనిషి ఎల్లమ్మ సహాయంతో ఇంటి పనులన్నీ ఆమే చక్కబెటుకుంటుంది. ఎల్లమ్మ చీకటితోటే వచ్చి గదులు చిమ్మి అంట్లుతోమి వెళ్ళిపోతుంది. మళ్ళీ సాయంత్రం వచ్చి యించుమించు అదే పనిచేసి వెళ్తుంది. కూరలూ, గీరలూ యింటివద్దకే అమ్మకు రావటంవల్ల ఏ వారానికో, ఏ పది రోజులకో తప్ప మార్కెట్టుకి వెళ్ళే పని ఆమెకు తగిలేది కాదు. దంపతులు దగ్గరగా వుండటం కాని, మాట్లాడుకోటం కాని చూసే అవకాశం ఎల్లమ్మకు ఎప్పుడూ కలగలేదు.

ఒకరోజు అర్జంటుగా అవసరం వచ్చి, వచ్చే నెల జీతంలో అయిదు రూపాయలు ముందే తీసుకుపోవటానికి ఎల్లమ్మ వచ్చింది. అప్పుడు మధ్యాన్నం పదకొండయింది. ఆమె పనిలో ప్రవేశించాక ఆ వేళకు ఆ యింటిదగ్గర ఉండటం అదే మొదటిసారి. సుబ్బయ్య భోంచేస్తున్నట్టు గ్రహించి పెరట్లో వేపచెట్టు నీడని నిలబడింది. సుబ్బయ్య కోపంతో మాట్లాడటం ఆమెకు వినపడింది. క్షమించమని సీతమ్మ బ్రతిమాలుతున్నది. భార్య బ్రతిమాలినకొద్దీ సుబ్బయ్య కంఠస్వరంలో కాఠిన్యం హెచ్చుస్థాయిలో ధ్వనిస్తోంది. భార్యని రోజూ యిట్లాగే బాధపెడుతుంటాడు కావాల్ననుకుంది ఎల్లమ్మ.

సుబ్బయ్య చెయ్యికడుక్కోటానికి పెరట్లోకి రావటం చూసి ఎల్లమ్మ చెట్టుచాటుకి తప్పుకుంది. అతను చెయ్యి కడుక్కుని వెళ్ళిపోగానే ఎందుకో సీతమ్మ పెరట్లోకి వచ్చి ఎల్లమ్మని చూసి నిర్ఘాంతపోయి అడిగింది.

'ఏమే, నువ్వెప్పుడొచ్చావ్'

'యిప్పుడే నమ్మ'

'ఏదో వుంది సంగతి. లేకపోతే యీ వేళప్పుడు రావు'

'సంగతి కేటుందమ్మ. పిల్లత్తారింటికెల్తా దియ్యాల. ఒక్క అయిదురూపాయలడుక్కోపోదా మనొచ్చా.'

'అయిదురూపాయిలు కాదుగదా అయిదుకానులుకూడా లేవు నా దగ్గర.'

'అలాగంటే ఎలాగమ్మ. బాబుగోర్నడిగయినా యిప్పించండి.'

'ఆయన ఒకటో తారీఖున తప్ప ఒక్క దమ్మిడీ కూడా యివ్వరు. అది ఆయన నియమం.

ఏమాత్రం అవకాశమున్నా డబ్బు ఇవ్వటానికి సీతమ్మ వెనుతీసేమనిషి కాదని ఎల్లమ్మకు తెలుసు. అందువల్ల యింకేమీ అనలేక ఎల్లమ్మ వెళ్లిపోతుంటే వుండమని చెప్పి సీతమ్మ వంటింట్లోకి వెళ్లింది. డబ్బు తీసుకురావటానికి వెళ్లిందని ఎల్లమ్మ ఆశపడింది. కాని సీతమ్మ తీసుకొచ్చింది డబ్బు కాదు. ఒక గిన్నెలో అన్నం, కాస్త వంకాయకూర, కొంచెం బీరకాయపచ్చడీ తీసుకువచ్చి ఎల్లమ్మముందు పెట్టింది. సాధారణంగా ఆ యింట్లో వంటగిన్నెలు కాళీగా పడతాయి. సీతమ్మ యిప్పుడు అన్నం యివ్వటం చూసి—

'మీరుగాని యీ పొద్దు అన్నం తిన్లేదేటి?' అని అడిగింది.

'తినకేం, కడుపునిండా తిన్నాను. కొంచెం మిగిలిపోయింది తీసుకెళ్లు' సీతమ్మ అబద్ధమాడింది. నిజంగా ఆమె తిన్నది తిట్లు కాని అన్నం కాదు.

'అమ్మ ఓసంగతడుగుతాను కసర్రు కదా?' గిన్నె తీసుకుంటూ ఎల్లమ్మ అడిగింది.

'ఏమిటే అదీ?'

'ఈయాల బాబుగోరు మీ మీద మండిపడ్రు. రోజూ అంతేనమ్మ ఆ బాబు?'

'నీ ముఖం రోజూ అల్లా ఎందుకుంటారే? ఈ వాళ ఆయన వొంట్లో బాగుండక కొంచెం చిరాకు పడ్డారు.

ఎల్లమ్మకు ఆ జవాబు తృప్తికరంగా లేదు.

'ఈ యమ్మ బాధలు ఎల్లబుచ్చుకునే రకం కాదు' అనుకుంది వెళ్లిపోతూ.

మర్నాడు ఎల్లమ్మ పని ముగించుకుని యింటికి పోబోతుంటే సీతమ్మ పిల్చి చెప్పింది—

'ఈవాళ నాకు చాలా పనుంది. మధ్యాన్నందాకా యిక్కడేవుండి భోంచేసి వెళ్ళు'

'ఎవరన్నా చుట్టాలొత్తారా అమ్మ?"

'చుట్టాలు కాదే ఈ వాళ బాబుగారి పుట్టినరోజు. నువ్వు బజారుకివెళ్లి సరుకులు తేవలసి వుంటుంది'

సుబ్బయ్య పుట్టినరోజుకు చాలా ప్రాముఖ్యం యిస్తాడు. పుట్టినరోజునాడు యిష్టమైన పదార్థాలతో తృప్తికరంగా భోంచేసి ఆనందంగా కాలం గడిపితే ఆయుర్వృద్ధి అని అతడికి గట్టినమ్మకం. పెళ్ళయాక యిప్పటివరకూ ముప్ఫైతొమ్మిది సార్లు తన జన్మదినోత్సవం అత్యంత ఆనందదాయకంగా జరిపించుకున్నాడు. అతడికి యిష్టమైన పిండివంటలు సీతమ్మకు బాగా

తెలుసు. అవన్నీ తప్పనిసరిగా అతడి పుట్టినరోజునాడు చేసేది. ఆమె అదృష్టం వల్లనో లేక దురదృష్టంవల్లనో సీతమ్మ పుట్టినరోజుకూడా భర్తపుట్టిన రోజునాడే తటస్థపడుతుంది. అయినా భర్తపొందిన ఆనందంవల్ల కలిగిన సంతోషం తప్ప సీతమ్మకు ఆ రోజంటే ప్రత్యేకమైన అర్థం ఏమీ లేదు. భార్య పుట్టినరోజూ, తను పుట్టినరోజూ ఒకనాడే అని సుబ్బయ్యకు కూడా తెలుసు. కాని ఎప్పుడూ 'నా పుట్టినరోజు' అంటాడే కాని మన పుట్టిన రోజని మాట వరసకైనా అనడు.

తన డబ్భైఅయిదో పుట్టినరోజు వుదయం అమితోత్సాహంతో ఆరుమైళ్ళు నడిచాడు సుబ్బయ్య, మామూలు రెండు మైళ్ళకు బదులు. ఎక్కువ నడిస్తే తనకు ప్రత్యేకం తయారు చెయ్యబడే పిండివంటలను ఎక్కువగా తినొచ్చని అతడి నమ్మకమై ఉంటుంది. సీతమ్మమాత్రం ఆరోజు ఒక విధమైన మానసిక సంక్షోభానికి గురయింది. నలభైఏళ్లు! నిజంగా తన వైవాహిక జీవితం అంత దీర్ఘమైనదా? అయితే తను నలభై ఏళ్ళనించి జీవితాన్ని మెల్ల మెల్లగా త్యాగం చేస్తూవుందన్నమాట; నలభైఏళ్ళనించి మెల్లమెల్లగా ముసల్దయిపోయింది; నలభై ఏళ్ళనించి సౌఖ్యం కోసం కేవలం ఎగురుచూపటంతోనే గడిపింది; నలభైఏళ్ళనించి అప్పుడప్పుడు తిరుగుబాటు తలపులు కలగటం, వాటిని బలవంతాన్న అణచిపెట్టటం జరిగింది; నలభైఏళ్ళలోనూ ఆమె కనిన కలలే నిజమైతే ఉద్యోగం చేసే కొడుకొకడు, పిల్లల తల్లిఅయిన కూతురొకతె, పెళ్ళి కెదిగిన కూతురు మరొకతె వుండేవారు!

నలభైఏళ్ళ క్రితం సీతమ్మ తన యౌవనాన్ని-తనసర్వస్వాన్ని వివాహమనే తంతు ద్వారా సుబ్బయ్యకు అంకితం చేసింది. అతడు చాలా అందంగా వుండేవాడు; ఆమె అతడ్ని మనస్ఫూర్తిగా ప్రేమించింది; మనస్ఫూర్తిగా నమ్మింది. అతనితోటి తన భావిజీవితం ఆనందమయమనీ ఆశించింది. అయితే ఏం? పెళ్ళిజరిగిన మర్నాడే - సరిగ్గా మర్నాడే - ఆమెకు గొప్ప ఆశాభంగం కలిగింది అతనిలో ప్రవహించే ప్రతి రక్తబిందువూ అతి భయంకరమైన స్వార్థంతో నిండివుందని ఆనాడే ఆమె గ్రహించింది. నలభైసంవత్సరాల జీవితంలోనూ ఆమెకు అతడి సౌఖ్యంలో వాటా లేకపోగా అతడి కష్టాలభారాన్ని తానే భరించింది మిక్కిలి ఓర్పుతో. అతడి దృష్టిలో బంగాళాదుంప కూరకున్న విలువ ఆమెకు లేదు. సుబ్బయ్యకు సీతమ్మ అంటే యిష్టంలేదు. ఆమె చేసిన పుల్లిపాయపులుసు మాత్రం తగని యిష్టం!—ఈవిధంగా సీతమ్మ తన నలభై సంవత్సరాల వైవాహిక జీవితాన్ని తన ఏభైఆరో పుట్టినరోజున సింహావలోకనం చేసుకుంది.

సరిగ్గా పదకొండు గంటలకు భోజనపు గదిలో ప్రవేశించాడు సుబ్బయ్య భోజనం మాత్రం సిద్ధంగా లేదు! కోపంతో ముఖం కందగడ్డలా చేసుకుని వంటింట్లో ప్రవేశించాడు. కాని సీతమ్మ కనపడదు.

'సీతా' అని యిల్లు మారుమోగేట్టు అరిచాడు. పెరట్లోంచి ఎల్లమ్మ పరుగెత్తుకు వచ్చింది.

'సువ్వొచ్చావేం! అదెక్కడ చచ్చిందీ?'

'అచ్చమాంబగోరింటికెళ్లింద్రు.'

సుబ్బయ్య అదరిపడ్డాడు. సీతమ్మ ఎప్పుడూ బయటకుపోయి ఎరగదు. ఇల్లు కదలి ఏ పరిస్థితులలోనూ బయటకు పోరాదని ఆమెను తనే శాసించాడు. ఆ శాసనానికి లోబడి ఆమె నలభైఏళ్లు గడిపింది. ఈనాడు శాసనోల్లంఘన జరిగినందుకు అత

'ఇవాళ ఇదేమిటే? నీకు మతిగాలిపోయిందేమిటి' అన్నాడ సుబ్బయ్యగారు.

నికి కోపంతోపాటు ఆశ్చర్యం కూడా కలిగింది.

'అచ్చమాంబయింటికీ బుచ్చమాంబయింటికీ పెత్తనాలకుపోతే అన్నం ఎవడొచ్చి వడ్డిస్తాడనుకుంది?' అన్నాడు.

'మీ రీయాల పన్నెండింటికి భోంచేస్తారని చెప్పలేదు'

'పన్నెండింటికా! నా జన్మలో ఎప్పుడూ పన్నెండింటికి భోంచెయ్యలేదు.'

ఆ ఒక్క గంటా ఒక్క యుగంలా వుందాతడికి. ఇటువంటి పరిస్థితి అతడికెన్నడూ కలగలేదు. సీతమ్మ ఎందుకు వెళ్లినట్టు? అందులో యీ రోజున తన పుట్టిన రోజు! పైగా భోజన సమయం పదకొండునించి పన్నెండింటికి ఎందుకు మార్చినట్టు? ఇవన్నీ మనసులో చర్చిస్తూ పన్నెండు కొట్టేదాకా యిల్లంతా పచారు చేశాడు సుబ్బయ్య. అప్పటికీ సీతమ్మ రాలేదు. పెరటిగుమ్మం దగ్గరకువెళ్లి ఎల్లమ్మనడిగాడు.

'ఏం అదింకా రాలేదు కాదూ?'

'రాటం కూతంత ఆలీశమైనా తమరి కంగోరు పడొద్దన్నారు.'

'కూతం లేమిటి, గంటన్నరయితే' అని అంటుండగానే వీధి గుమ్మంలో పదధ్వని వినిపించింది. సీతమ్మ పిల్లిలా నడిచి వచ్చింది. ఆమె ముఖం కాంతి విహీనంగా వుంది. వీధి మెట్లు నాలుగూ ఎక్కినందువల్ల ఆయాసం కూడా వచ్చింది.

'నీ వుద్దేశమేమిటో కొంచెం వివరంగా సెలవిస్తావా?' కోపానికి ఎగతాళి కూడా కలిపి అడిగాడు సుబ్బయ్య.

"ఉద్దేశాని కేముంది? మీకీ వాళ కొంచెం ఆలస్యంగా అన్నం పెడదామనుకున్నాను. అంతే—రండి వడ్డిస్తాను."

ఆమె ప్రశాంతమైన జవాబు అతడి కోపాన్ని ఇనుమడింపచేసినా, తన ఆయుర్వృద్ధికి భంగం వస్తుందని కాబోలు మాట్లాడకుండా పీటమీద కూర్చున్నాడు. సీతమ్మ వంకాయకూర తీసుకువచ్చి వడ్డించింది.

"ఏమిటిది! ఈ వెధవ కూరంటే నాకసహ్యమన్న సంగతి నీకు తెలీదూ?"

"నాకు చాలా యిష్టం. నేనా కూర తిని ముప్ఫై ఏళ్ళయింది."

సుబ్బయ్యకు నోట మాట రాలేదు. పెళ్లాం ముఖంలోకి తీక్షణంగా చూశాడు. ఆమె ముఖమా రోజు చాలా శాంతంగా—గంభీరంగా వుంది.

సీతమ్మ యీసారి బీరకాయ పచ్చడి తీసుకొచ్చి వేసింది.

"ఏమిటీ నాటకం?"

"అవును. నాకా పచ్చడి ఎంతో యిష్టం."

"ఇదుగో యిటు చూడు. ఈవాళ నీకు మతేమయినా పోయిందా? లేక తలకాయ కాని తిరుగుతోందా?— అన్నీ నాకు యిష్టం లేనివే ఏడిశావేం?"

"నాకు యిష్టం కదా అని."

"అయితే యిదంతా కావాలనే చేశావన్నమాట?"

"ఇప్పటికి తెలిసిందా మీకా సంగతి? కావాలనే చేశాను."

సుబ్బయ్య సర్వాంగాలూ కంపించిపోయాయి. మితిమీరిన కోపంతో లేచి చెయ్యెత్తాడు కొట్టటానికి.

"అవును. కావాలనే చేశాను." జంకకుండా మళ్ళీ అంది.

ఆమెలో కొత్తగా రేకెత్తిన ధైర్యానికి బిత్తరపోయి మళ్లీ పీటమీద కూలబడ్డాడు సుబ్బయ్య.

"నీకు పిచ్చెత్తినట్టుంది—ఇకనేనా నా పుట్టినరోజు!" అన్నాడు అంతకంటె యింకేమీ అనలేక.

"అవును. ఇదే మీ పుట్టిన రోజు. నా పుట్టినరోజు కూడా యిదే. నాకు పిచ్చెత్తిందని అనుకోనక్కర్లేదు దీని అర్థం తెలుసుకోవాలనుంటే వినండి చెప్తా. నలభై ఏళ్లు!—ఇదుగో యిల్లా వినండి, నలభై ఏళ్లు మీ వింత కోర్కెలకూ, సరదాలకు దోహదం యిస్తూ, అందులో నాకు అణుమాత్రమైనా ఆనందం లేకపోయినా, మీ ఆనందమే నా ఆనందమని బలవంతాన్న శ్రమపడి మీ సౌఖ్యానికి తోడ్పడ్డాను. ఇన్నాళ్లూ నే నొక వ్యక్తినని కాని, నాకూ కొన్ని కోర్కెలూ, సరదాలూ వుంటాయని కాని గ్రహించేపాటి యింగిత జ్ఞానం మీలో లేకపోయింది. నలభై ఏళ్ల పాటు మీరు నన్నొక బానిసకన్న అధ్వాన్నంగా చూశారు. ఇన్నాళ్ళకు, ఈరోజున - నా పుట్టిన రోజున - నా యిష్టంవచ్చినవి చేసుకుతిని మీచేతకూడా తినిపిద్దామని బుద్ధిపుట్టింది. నా వంట్లో జవసత్వాలు వుడిగిపోయాయి. బహుశా వచ్చే పుట్టినరోజుకు నేను వుండకపోవచ్చు. కాబట్టి యీరోజన్నా నా

(46-వ పేజీ చూడండి)

ఒక గంటలో యౌవ్వనము

కామ స్తంభన

ధాతుపుష్టి. సంసారసుఖము నిచ్చుటలో సాటిలేనిది. వినాశచెందిన వృద్ధులయందు శక్తి, ఉత్సాహము నిచ్చును రు 2-8-0

మదన మంజరి ఫార్మసీ

184, చైనా బజారురోడ్డు, మద్రాసు. బెజవాడ—శ్రీనివాస మెడికల్ హాల్ పార్కు రోడ్డు, రాజమండ్రి—ఈశ్వరదాస్ & కో, మెయిన్ రోడ్డు. నెల్లూరు ఆర్యన్ ఫార్మసీ.

దెయ్యం

(12-వ పేజీ తరువాయి)

సుబ్బారెడ్డి సంతోషించాడు. కాని ఊఁ, ఆఁ, అని నళిగాడు.

"నీ ఉద్దేశం ఏమిటో సరిగా చెప్పు" అని నారాయణ తెగేసి అడిగాడు.

"ఆ! ఏమీ లేదు చింతలపూడిదగ్గర ఏదో పల్లెటూరంట మొన్న వాళ్ళొచ్చారు. పిల ఎర్రగా చక్కగా వుంటుంది వాళ్లు రు 250 కట్నం ఇస్తామన్నారు. వాళ్ళకేగాటా చెప్పనే లేదు. మరి నీమా టేమిటి చెప్పు" అన్నాడు ముసలాడు ఆశగా.

ఆమాట వినేటప్పటికి నారాయణకు కాళ్ల క్రిందభూమి కదలిపోయినట్లయింది నారాయణ ముఖం కందగడ్డలా తయారయింది. కళ్ళు చింతనిప్పుల్లా మెరుస్తున్నాయి.

తనెక్కడవున్నాడో తనకే తెలియదు. వళ్లు తెలియని ఆవేశంతో సుబ్బారెడ్డి కంఠం రెండుచేతులతో పట్టుకొని "దౌర్భాగ్యుడా! నీకూ కట్నం కావాలీ! కూలివాడికి, ఏరోజు కూలితెస్తే ఆరోజు తిండికి వుండేవాడికి కట్నం కావాలేం?" అని కంఠం గట్టిగా నొక్కేశాడు. ముసలాడి గోలకు ఇరుగుపొరుగువారంతా పరుగెత్తుకొచ్చారు నలుగు రయిదుగురువచ్చి నారాయణని పట్టుకొనేదాకా నారాయణకి తానేమిచేసింది తెలియనేలేదు. ముసలాడికి కాసిన్ని చన్నీళ్లు పట్టేరు కాని అప్పటికే అతని ప్రాణాలు గాలిలో కలిసి చాలసేపయింది.

ఆమరునాడు పత్రికలో పడింది "నారాయణ అనే వ్యక్తి తన కూతురుని చేసుకోమని అడిగితే కట్నం ఇమ్మన్నాడని, సుబ్బారెడ్డి అనే అతన్ని కంఠం పిసికిచంపాడు" అని.

మరి నాలుగు నెలల తరువాత, తిరిగి పత్రికలో ఇలా వ్రాసేరు. "కట్నం ఇమ్మన్నందుకు గాను గొంతుక పిసికి చంపిన నేరానికి నారాయణ అనే వ్యక్తికి ఉరిశిక్ష విధించబడింది"

ఆతరువాత నారాయణ దెయ్యం అయినాడని, వెంకటరెడ్డి కుటుంబాన్ని హింసిస్తున్నాడని, కట్నా లడిగే వాళ్ళందరికీ కనపడి భయపెడుతున్నాడని ఆ వూరి ప్రజలంతా అనుకుంటారు. ★

పుట్టిన రోజు

(18-వ పేజీ తరువాయి)

యిష్టానికి లోబడి సంచరించండి రేపటి నుంచీ మీ అధికారం మీరు యథాప్రకారం చెలాయించొచ్చు ఈ వాళ నాకు పుట్టిన బుద్ధికి క్షమించండి.'

చివరివాక్యం వుచ్చరించేప్పుడు కన్నీరు కార్చటం ఆమెకు తప్పని సరయింది. ఆ వాక్యం ఆమె పూర్వపు బానిసత్వాన్ని ఆమెకు అంటగట్టింది. ఆమె కళ్ళుకూడా క్షమార్పణ వేడుకొంటున్నాయి

సీతమ్మ మాటలు స్వార్థపరుడైన సుబ్బయ్య మనస్సు మీద ఏమాత్రంకూడా పని చెయ్యలేదనే చెప్పాలి. ఆమె క్షమార్పణ వేడటంవల్ల పోయిన ధైర్యంమాత్రం తిరిగొచ్చింది. మళ్లీ ఆమెను యథాప్రకారం కీలుబొమ్మగా చెయ్యవచ్చునన్న సంగతి తట్టగానే విషంతో కూడిన చిన్న నవ్వు నవ్వాడు.

సీతమ్మ వంటింట్లోకి వెళ్లి పళ్లెంనిండా రకరకాల పదార్థాలుపెట్టి తీసుకువచ్చి వడ్డించింది. వాటిల్లో చెప్పతగినవి యివి: బంగాళాదుంప కూర, గోంగూర పచ్చడి, పెసరట్లూ, మైసూరుపాక్ ఇవంటే సుబ్బయ్యకు చచ్చేటంత యిష్టం. అనుకోకుండా యివన్నీ వొచ్చిపడేటప్పటికి అంతా అయోమయం అయిపోయింది సుబ్బయ్యకి. ఏదో మాట్లాడాలనుకున్నాడు. కాని ఏమి మాట్లాడాలో తోచక సీతమ్మవైపు నవ్వుపుగించి చూస్తున్నాడు.

సీతమ్మ మళ్లీ వంటింట్లోకి వెళ్లింది. ఈసారి ఏం తీసుకువస్తుందా అని సుబ్బయ్య ఎదురుచూస్తున్నాడు. గిన్నెతో పులుసు తీసుకువచ్చి కంచం పక్కన పెట్టింది.

"ఏమిటిది?" ఏదోఒకటి మాట్లాడాలని అడిగాడు.

"ఉల్లిపాయల పప్పుపులుసు."

"అయితే నిన్ను క్షమించక తప్పదన్న మాట." ★

జారుడుదారి

(2)-వ పేజీ తరువాయి)

న్నారు శ్రీపతికి లక్షలున్నయ్ కాబట్టి కార్లలో తిరుగుతూ, పంకాల క్రింద మసలుకుంటుంటాడు. తెలివితేటలు, పెద్ద పెద్ద చదువులు డబ్బు ముందు దిగదుడుపే ననుకున్నాడు దాంతో ఏదో ఉద్రేకం వచ్చింది. కూలీలకు నాయకత్వం వహించాడు.

మధిర సుబ్బన్న దీక్షిత కవి ప్రణీత

కాశీమజిలీ కథలు

మొదటినుండి 12 భాగములు

కాదంబరి పునర్ముద్రితములైనవి

వెల ఒక్కొక్క భాగము రు 4/- కాదంబరి రు 2/-

మధిర శివరామకృష్ణశాస్త్రి

ఉల్లితోట వీధి : : రాజమండ్రి